ప్రజాశక్తి

మంగళవారం 18 ఏప్రిల్ 2023

5

అల్లూరి సీతారామరాజు

ఉపాధ్యాయులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - హుకుంపేట:1998 డిఎస్సిలో మండలం నుంచి ఎంపికైన ఏడుగురు ఉపాధ్యాయులకు సోమవారం నియామక పత్రాలను ఎంఈఓ చిట్టపులి బాబురావు అందజేశారు.యధావిధిగా విధులకు క్రమం తప్పకుండా హాజరవ్వాలని పేర్కొన్నారు. నియామక పత్రాలను. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బైరాగి మజ్జి, విద్యాశాఖ కోఆర్డినేటర్ బి.జయరాజు పాల్గొన్నారు.

నియామక పత్రాలు స్వీకరిస్తున్న 1998 డిఎస్‌సి ఉపాధ్యాయులు

ప్రైవేటీకరణ ఆపాలని..

పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రాథమిక వ్యవసాయ రుణ పరపతి సంఘం (పిఎసిఎస్) ప్రైవేటీకరణ ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అబీన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.కలెక్టరేట్ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో పిఎసిఎస్ ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టి నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2019లో జారి చేసిన ఉద్యోగుల వేతన సవరణ జిఒ అమలు చేయాలని, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె) పిఎసిఎస్‌లో విలీనం చేయ్యొద్దని డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతన సవరణ జిఒ-36ను వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అమలు చేయకపోగా, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరపతి సహకార సంఘాలను బహుళ ప్రయోజనాల సంఘాలుగా మార్చాలన్న ఆదేశాన్ని వైసిపి ప్రభుత్వం అమలు చేసి పిఎసిఎస్‌లను ప్రైవేటు రంగం చేతిలో పెడుతుందన్నారు. సహకార సంఘాల ప్రైవేటీకరణతో ఉద్యోగులతో పాటు రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు. 2019 ఏప్రిల్ 1 నుంచి ఉద్యోగుల పేరివిజన్ అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయసును ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 ఏళ్లకు పెంచాలన్నారు. సంఘాలన్నీ కంప్యూటరీకరణ చేయాలని, టిడిఎస్‌లో ఉన్న ఇబ్బందులు తొలగించాలని, ప్రాథమిక సహకార పరపతి సంఘాల ఉద్యోగుల న్యాయ సమ్మతమైన సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, అప్పలనాయుడు, కేశవరావు, జోగేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, ఉద్యోగులు

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉమామహేశ్వరరావు, ఉద్యోగులు

జిల్లా ఆసుపత్రి లో బారులు తీరిన రోగులు

జిల్లా ఆసుపత్రి కిటకిట

ప్రజాశక్తి-పాడేరుటౌన్:ఎండలు ప్రజలను రోగాల బారిన పడేస్తున్నాయి. వేసవి ఎండలు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఆసుపత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిల్లా ఆసుపత్రికి అధిక సంఖ్యలోనే జ్వర బాధితులు తరలి వచ్చారు. ప్రైవేటు ఆసుపత్రులు రద్దీగానే ఉన్నాయి.

కార్యదర్శికి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి -జి.మాడుగుల:జి.మాడుగుల సచివాలయ కార్యదర్శిగా పని చేస్తున్న నాయుడుకు ఈఓపిఆర్డిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఎంపీడీవో చంద్రశేఖరరావు ఉత్తర్వులు జారీ చేశారు.. ఈ సందర్భంగా ఉత్తర్వు పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈఓపిఆర్డిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన నాయుడు మాట్లాడుతూ, సచివాలయాలను, సర్పంచులను సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఉత్తర్వుల కాపీని స్వీకరిస్తున్న కార్యదర్శి

పిఒను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

పిఒకు ఎమ్మెల్యే ఫాల్గుణ సన్మానం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ పిఒగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన వి.అభిషేక్‌ను ఎమ్మెల్యే పాల్గుణ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పిఒను కలసి సన్మానించారు. పాడేరు సబ్ కలెక్టర్ గా అభిషేక్ చేసిన సేవలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పెదబయలు మండల జడ్ పిటిసి కె.బొంజు బాబు, మాజీ ఎంపిపి ఎస్.ఉమామహేశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి వి.శాంతి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆశాల ఆందోళన

ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రభుత్వ ఆదేశాలు లేకుండా జిల్లా, పిహెచ్‌సి అధికారులు పదేపదే సమాచారం కోసం తమపై ఒత్తిడి తెస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆశావర్కర్లు ఆందోళన చేశారు. తమపై అనవసర వేధింపులను అడ్డుకోవడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంపచోడవరం ఐటిడిఎ ఎదుట ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ, తమ సమస్యల పరిష్కారానికి ఏడాదిగా పలుమార్లు వినతులు ఇచ్చినా ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేకుండానే పిహెచ్‌సి అధికారులు డేటా అడుగుతున్నారని, ఇవ్వకుంటే జీతాలు కట్‌చేస్తాం, నిలుపుదల చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. నోడల్ అధికారుల వేధింపులను తక్షణమే ఆపకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చనిపోయిన ఆశా వర్కర్ల కుటుంబాలకు న్యాయం చేయాలని, గతేడాది రంపచోడవరం ఐటిడిఏ ఎదుట 66 రోజుల రిలే దీక్షలు సందర్భంగా సమస్యల పరిష్కరిస్తామనిఅప్పటి ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, అప్పటి కాకినాడ జిల్లా కలెక్టర్ , ప్రాజెక్టు అధికారి ప్రవీణ్ ఆదిత్య హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు.అంతకుముందు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు అందించారు. పిఒ సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర కమిషనర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా ఆశా డేలోగా ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే 48గంటల నిరవధిక దీక్షకు వెళ్ళనున్నట్లు హెచ్చరించారు. ఆందోళనలో 16 పిహెచ్‌సిల ఆశావర్కర్లు పాల్గొన్నారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు ఇ.సిరిమల్లె రెడ్డి, టి.శ్రీనివాస్ పాల్గొని ఆశాలకు సంఘీభావం తెలిపారు.

పిఒకు వినతిపత్రం ఇస్తున్న ఆశా నేత వాణిశ్రీ

మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి లాగరాయి పిహెచ్‌సిల పరిధిలో మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులు లిఖిత, శ్రీదుర్గ సోమవారం తెలిపారు. లాగరాయి పిహెచ్‌సి పరిధిలోని లబ్బర్తిలో ఒక కోవిడ్ పాజిటివ్ కేసు నమోదు కాగా, రాజవొమ్మంగి పిహెచ్‌సి పరిధిలో దోసరపాము గ్రామంలో రెండు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి బాధితులను హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మండలంలో కోవిడ్ కేసులు నమోదై, పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, శానిటైజర్లు వాడాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు,

దోమలమందు పిచికారీ పక్కాగా చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:మలేరియా నియంత్రణకు మొదటి విడత దోమలమందు (ఎసిఎమ్- 5శాతం) స్ప్రేయింగ్ ప్రతి ఇంట్లో ఫక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం పాడేరు మండలం కే.కుమ్మరిపుట్టు వీధిలో మలేరియా నియంత్రణ స్ప్రేయింగ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 59 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సుమారు 79 వేల ఇళ్ళల్లో స్ప్రేయింగ్ జరుగుతోందని, ప్రతి మండలంలో రెండు స్ప్రేయర్లు, నాలుగు బృందాలతో 45 రోజులలో పూర్తి చేయాలన్నారు.స్థానిక సర్పంచ్, వాలంటీర్, ఆశ కార్యకర్తల సహకారం తీసుకొని శత శాతం స్ప్రేయింగ్ నిర్వహించాలని సూచించారు.మలేరియా నియంత్రణ పట్ల ప్రజలలో విస్తత ప్రచారం చేయాలన్నారు. స్ప్రేయింగ్‌కు ముందు రోజు కుటుంబ సభ్యులకు తెలియజేయాలని తెలిపారు. హెల్త్‌సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించి తగు సూచనలు జారీ చేయాలని, గ్రామాల వారీగా సూక్ష్మ ప్రణాళిక రూపొందించి వైద్యాధికారి ఆద్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది పర్యవేక్షించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, డిఎంహెచ్ఓ జమాల్ బాషా, టిబి నియంత్రణాదికారి విశ్వేశ్వర నాయుడు, జిల్లా మలేరియా నియంత్రణాదికారి సాంబ మూర్తి, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ, మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్ప్రేయింగ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

సంతకాల సేకరణ చేపడుతున్న శాంతకుమారి, నేతలు

కాంగ్రెస్ ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పెదబయలు రూరల్:బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పాచిపెట్టి శాంత కుమారి ఆధ్వర్యంలో సంతల కాల సేకరణ సోమవారం చేపట్టారు. విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈనెల 17నుండి మే నెల 15 వరకు ఈ కార్యక్రమం చేపడతామన్నారు.సామాజిక తెగల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ స్వ ప్రయోజనాలు, ఓట్లు, సీట్ల కొరకు దుర్మార్గంగా ఆలోచించడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో అరకు మండల కార్యదర్శి, యూత్ నాయకులు వెంకట్, పెదబయలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొర్ర కోమటి, పరుశురాం, కొర్ర కొండబాబు, మత్స్యరాజు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పథకాలతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వైసిపి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పాడేరు మండలం గాలిపాడు, బుర్రగొంది గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుటుంబాల్లో ఏ మేరకు మేలు చేకూరిందో వివరించారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో భవిష్యత్తులో మరింత మందికి మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్ర మంగమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు ఎస్.రాంబాబు, సర్పంచ్ కె.సన్నిబాబు, సీనియర్ నాయకులు సీదరి మంగ్లన్నదొర పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని పోతంగి పంచాయతీ గొందిగూడ ఎంపీపీ పాఠశాలను సోమవారం ఎంఈఓ ఎం.రామచంద్రరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి, బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాడు నేడు పథకంలో భాగంగా నూతన పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదనలను పంపనున్నట్లు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

మోడీని గద్దె దించితేనే దేశానికి రక్షణ

పాడేరులో ప్రచారభేరి పాదయాత్ర

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఇంటింటా కరపత్రాలను పంచుతూ, ప్రజల మనోభావాలకు భిన్నంగా రాష్ట్ర ప్రయోజనాలకు మోడీ ప్రభుత్వం ఎలా గండికొడుతున్నారో వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం చెప్పాలని పిలుపునిస్తున్నారు. (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ప్రజాశక్తి - విఆర్ పురం: మోడీని గద్దె దించడం ద్వారా దేశానికి రక్షణ కల్పించాలని కోరుతూ మండలంలో ముద్దులగూడెం గ్రామంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ. ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలను పంచుతూ, ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు బిజెపి ప్రభుత్వ విధానాలతో దేశసమగ్రతకు పొంచి వున్న ముప్పును ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు.విభజన చట్టంలో హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తోందని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, .పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నేటికీ పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లింపు, న్యాయం జరగకున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ముద్దులగూడెం నిర్వాసితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు. సత్తిబాబు, శ్రీరామ్మూర్తి, సోడి మల్లయ్య. నాయకులు జి.లక్ష్మణరావు, కాంతారావు పాల్గొన్నారు.

ప్రచారభేరిలో సిపిఎం, సిపిఐ నేతలు

అర్హులందరికీ అటవీహక్కు పత్రాలివ్వాలి

ఎటపాక : గిరిజనులు సాగులో ఉన్న ప్రతి ఒక్క సెంటుకూ అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు అకిశెట్టి రాము కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద, ప్రైవేటీకరణ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కన్నాపురం, సీతాపురం, మద్దిమడుగు గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రచారభేరి నిర్వహించారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం గిరిజన చట్టాలను అడవిబిడ్డలకు అన్యాయం చేస్తోందని, మన్యంలోని గిరిజనుల మధ్య కుల,మతాల విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బోయ/వాల్మీకి, బెంత ఒరియాలను గిరిజనుల జాబితాల్లో చేర్చి నిజమైన గిరిజనానికి రాష్ట్రప్రభుత్వమూ అన్యాయం చేస్తోందన్నారు. వీటన్నింటికీ మన్యవాసులంతా సంఘటితమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర విధానాలను నిరసిస్తూ వచ్చేనెల 4న చింతూరులో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డేగల మాధవరావు, లింగాల వెంకన్న, గాడిద ముక్కోటీశ్వరరావు, గొల్లపల్లి రమణయ్య, యాకుబ్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రధాని నరేంద్ర మోడీని గద్దె దించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఎం, సిపిఐల నేతలు ప్రచార భేరిని సోమవారం చేపట్టారు. అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ,దేశంలో రోజు రోజుకు దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.నూతన అడవి పాలసీ, నూతన ఎడ్యుకేషన్ పాలసీ విధానం తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25వ అరకువేలిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొర్రా మగ్గన్న, టి.హరి, జి.గాసి, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ, సిపిఎం జిల్లాల కార్యదర్శులు పొట్టిక సత్యనారాయణ, బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. ఈనెల 14న సీలేరులో ప్రారంభించిన పాదయాత్ర నాలుగవ రోజు సోమవారం చింతపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విభజన చట్టంలో భాగంగా విభజన హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. జీవో 3కి చట్టబద్ధత కల్పించి కల్పించి 1/70 చట్టాన్ని కాపాడాలని కోరారు. ఈనెల 24న పాడేరు సభతో ఈ పాదయాత్ర ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ మండలాల కార్యదర్శిలు పాంగి ధనుంజయ్, పెట్ల పోతురాజు, సాగిన చిరంజీవి, కిలో సింహాచలం, సిపిఐ నాయకులు అమర్, సత్తిబాబు, సింహాచలం పాల్గొన్నారు.

హుకుంపేటలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

హుకుంపేట: హుకుంపేట, కొంతిలి, ములియా పుట్టు, గూడ, అడ్డుమండ, జీ.కేమండ, బారామసి పంచాయతీల్లో ప్రచార భేరి జోరుగా సాగింది.అనంత గిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, బోయ/వాల్మీకులను గిరిజన ఎస్టీ జాబితాలోకి చేర్చడం సరికాదన్నారు. గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ విషయంలో మౌనంగా ఉండటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.జీవో 3 ను రద్దు చేయడంతో ఉన్నత చదువులు చదివిన గిరిజన యువకులు ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పండించిన చింతపండు, మిరియాలు, పసుపు పంటలకు గిట్టుబాటు ధర లభించ లేదన్నారు. ఈ నెల 25న అరకు వేలిలో జరిగే బహిరంగ సభకు గిరిజన ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ రావు, గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్సులు తాపుల కృష్ణారావు, కిల్లో రామారావు, సీపీఎం మండల నాయకులు అప్పలకొండ పడాల్, కొర్ర అప్పారావు, పాంగి సోమన్న, సీదరి చంద్రబాబు, ప్రజా నాట్య మండలి కళాకారులు కొగేశ్వరరావు పాల్గొన్నారు.

అరుకులో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వి.ఆర్.పురంలో ప్రచారభేరి పాదయాత్ర

ఎటపాకలో కరపత్రాల ఆవిష్కరణ

పనులు ప్రారంభిస్తున్న ఎంపిటిపి సభ్యులు అప్పారావు

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: మండలంలో పెద కొడాపల్లి పంచాయతీ కొత్తపోయిపల్లి గ్రామంలో జల జీవన్ మిసన్ నిధులు లక్ష 50 వేల వ్యయంతో సోమవారం స్థానిక ఎంపిటిసి పాంగి అప్పారావు, పలాసి మోహన్ రావులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ చిట్టిబాబు, వార్డు సభ్యులు మర్రి రాజారావు, పాంగి భాస్కరరావు, కొర్ర రాజారావు పాల్గొన్నారు.

కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో లక్ష్మీపురం పంచాయతీలోని పలు గ్రామాలకు విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి ఆర్థిక సహకారంతో గ్రావిటీ కుళాయిలు, తాగు నీటి ట్యాంక్‌లను సోమవారం ప్రారంభించారు. లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్, ప్రాజెక్టు డైరెక్టర్ మణికంఠన్, ఇంజినీరింగ్ వేణుగోపాల్‌లు పాల్గొన్నారు. జబడా, కోడపుట్, మోవులపుట్, దాబుగుడ, అత్తీకల్ గ్రామాలలో మంచి నీటి ట్యాంక్, కుళాయిల నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అర్లాబు. సత్యం, సీనియర్ మేనేజర్ అభిరామ్, కార్యదర్శులు సోమేష్, ప్రశాంత్, వార్డు సభ్యులు హరి, సొద, సంస్థ ప్రతినిదులు, ప్రజలు పాల్గొన్నారు.

బిఆర్.అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2023-24 విద్యా సంవత్సరానికి విశాఖపట్నం జిల్లా పరిధిలోని మూడు అనకాపల్లి జిల్లా పరిధిలో గల 8 గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 23వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు రెండు జిల్లాల గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. ఈ రెండు జిల్లాల్లో 5వ తరగతిలో 880 సీట్లు కోసం 3496 మంది, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంకు 880 సీట్ల కోసం 1969 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 23వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందని తెలిపారు. ఐదో తరగతి ప్రవేశపరీక్షకు 50 మార్కులకుగాను నాలుగో తరగతి సిలబస్ నుంచి తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవిఎస్ నుంచి ప్రశ్నలు, ఇంటర్మీడియట్ ప్రవేశపరీక్షకు 10వ తరగతి స్థాయిలో గణితం, ఫిజికల్ సైన్సు, బయాలజీ, సామాజిక అధ్యయనాలు, ఆంగ్లం, లాజికల్ రీజనింగ్ నుంచి 100 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుందని తెలిపారు. పరీక్ష ఒఎంఆర్ షీట్ విధానంలో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని వివరించారు. 5వ తరగతి విద్యార్థులు http://apgpcet.apcfss.in వెబ్ సైట్ ద్వారా, ఇంటర్ విద్యార్థులు http://apgpcet.apcfss.in/Inter వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కేటాయించిన పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు ఎదురైతే ఆన్‌లైన్ అప్లికేషనులో పొందుపరచిన పరీక్షా కేంద్రానికి ముందుగా వెళ్లి నామినల్ రోల్స్‌లో వారి యొక్క పేర్లను సరిచూసుకొని పరీక్షకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, బ్లూ లేదా బ్లాకు బాల్ పాయింట్ పెన్ తీసుకురావాలని తెలిపారు. పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0891-2799641, 7207000723 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

20 నుంచి రామానుజ తిరు నక్షత్ర పూజలు

ప్రజాశక్తి-సింహాచలం : సింహాచల దేవస్థానం కొండపైన ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు శ్రీ భగవత్ రామానుజుల తిరు నక్షత్ర పూజలు జరుపనున్నారు. ఈ సందర్భంగా ఆ రోజుల్లో జరిగే అన్ని అర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజుల్లో సాయంత్రం 7 గంటల వరకే స్వామివారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

నాడు - నేడు పనుల్లో నాణ్యత పాటించండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పాడేరు: మన బడి నాడు, నేడు రెండవ విడత పనులలో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్యా శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో చేపట్టిన నాడు- నేడు పనులలో అనేక ఫిర్యాదులు అందాయని, వాటిని దృష్టిలో పెట్టుకుని ఈ సారి పనులపై గట్టి నిఘా ఏర్పాటు చేసామని కలెక్టర్ స్పష్టం చేసారు. పనులు చేపట్టడంలో కొంతమంది ప్రధానోపాధ్యాయులు సహకరించటం లేదని, డబ్బులు కూడా అడుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కొయ్యూరు, చింతపల్లి మండలాలలో నాలుగు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకారం అందించ లేదనే ఫిర్యాదులున్నందున జూన్ 12వ తేదీ నాటికి పనులు పూర్తి చేయించకుంటే బదిలీ చేస్తూ అడ్వాన్స్ నోటీస్ జారీ చేయాలని డి.ఇ.ఓ సలీం భాషాను ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం భాషా, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ అధికారి స్వామినాయుడు, పాడేరు డివిజన్ లోని 11 మండలాల ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై అభ్యంతరాలను గ్రామ సభలో తెలపాలి

రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వేకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. రీ సర్వే ఖరారు చేసే ముందు వీటిపై అభ్యంతరాలను గ్రామ సభలో చదివి వినిపించాలన్నారు. అభ్యంతరాలు ఉంటే తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఖరారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేసారు. గ్రామ సభలు జరపకుండా, ప్రజల సంతకాలు తీసుకుని నిర్వహించినట్లు తన దృష్టికి వచ్చిందని, అలా చేస్తే సహించేది లేదన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనుగుడా భూముల రిజిస్టర్ తయారీపై తహశీల్దారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. సర్వేలో లోపాలు లేకుండా తగిన నాణ్యతలు పాటించాలని చెప్పారు. నోడల్ అధికారులు రీ సర్వేపై సమీక్షలు నిర్వహించాలన్నారు. విఆర్ఓలు, గ్రామ సర్వేయర్ల బృందాలు సమన్వయంతో పనిచేసి సర్వేలో అభ్యంతరాలను పరిష్కరించాలన్నారు. సర్వే పూర్తి చేసిన చోట సర్వే ఎల్పిఎం నెంబర్లు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. పివిటిజి ఓటర్ల నమోదు ప్రక్రియ పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేసారు. ముఖ్యమంత్రి వేగంగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వేపై రంపచోడవరం ఉప తహసీల్దార్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల పైబడి ఒకే గ్రామంలో పని చేస్తున్న వి.ఆర్.ఓ.ల జాబితా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒలు వి.అభిషేక్, సూరజ్ గనోరే సబ్ కలెక్టర్ శుభం బన్సల్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, డి ఆర్ ఓ పి.అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, తహశీల్దారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల సంచారం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని పశువులు రోడ్లపై అడ్డంగా సంచరిస్తుండటంతో అటు వాహనదారులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల యజమానులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో ప్రమాదాలు చోటు జరుగుతున్నాయి. యండపల్లివలస, అరకులోయ ప్రధాన రహదారిపై పశువులు రోడ్డుపైనే సంచరిస్తుండటంతో ప్రజలు తంటాలు పడుతున్నారు. పశువులు గుంపులు గుంపులుగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళలో పశువులు మందలుగా రోడ్లపై ఉండటంతో రోడ్డు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

స్టవ్ ను పంపిణి చేస్తున్నా సాయిబాబు తదితరులు

మహిళలకు పొయ్యిల పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు రూరల్:మండలంలో లింగేటి పంచాయతీ తర్లసింగి గ్రామంలో సోమవారం క్రాప్ జోన్ ఫారెస్ట్ ప్రవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ అబ్బూరి సాయిబాబు చేతుల మీదుగా సుమారుగా 3వేల ఖరీదైన స్టవ్‌లను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ, మట్టి పోయ్యిలు హానికరం అని, వాయు కాలుష్యం వ్యాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లక్ష్మణ, మండల కో ఆర్డినేటర్ పాంగి సింహాచలం, పాడేరు కోఆర్డినేటర్ మధు, అంతగిరి ఏం సి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భారీ చోరీ

- 39 తులాల బంగారం, రెండు కిలోల వెండి అపహరణ

ప్రజాశక్తి -కంచరపాలెం : మురళీనగర్ పట్టాబిరెడ్డి గార్డెన్స్‌లో భారీ చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఘటనకు సంబంధించి కంచరపాలెం క్రైం పోలీసుల కథనం ప్రకారం... విశ్రాంత ఉద్యోగి పైలా త్రినాథ మూర్తి పట్టాబిరెడ్డిగార్డెన్స్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద కుమారుని వద్దకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు వెనుక నుంచి కిటికీ తెరిచి చోరీకి పాల్పడ్డారు. ఈ నెల 15వ తేదీన సమీపంలోనే ఉంటున్న త్రినాథమూర్తి రెండవ కోడలు ఇంటిని శుభ్రపరిచేందుకు వచ్చారు. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఇంటి వెనుక కిటికి గ్రిల్ తొలగించి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి త్రినాథమూర్తికి సమాచారమందించారు. దీంతో త్రినాథమూర్తి వెంటనే విశాఖ వచ్చి కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో భద్రపరచిన 39 తులాల బంగారం, రెండు కిలోల వెండి, రూ.50 వేలు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో తనిఖీ నిర్వహించి దర్యాప్తు చేపట్టారు.

పలు చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో వివిధ చోరీ కేసుల్లో నిందితుడు నూకరాజును అరెస్ట్ చేయడంతోపాటు నిందితుడి నుంచి 17.75 తులాల బంగారం వస్తువులు, 115 తులాల వెండి వస్తువులు, రూ.మూడు లక్షల 61 వేల ఎనిమిది వందల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పి కె.వి. మురళీకృష్ణ వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో దొంగతనాలపై ఆరా తీశామన్నారు. తన ఆదేశాల మేరకు అదనపు ఎస్పిలు సత్యనారాయణ క్రైమ్, బి విజయభాస్కర్ పరిపాలన, అనకాపల్లి ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఎం.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా సోమవారం కె.కోటపాడు మండలం మేడిచర్ల జంక్షన్ వద్ద ముందస్తు సమాచారంతో కె.కోటపాడు సిఐ ఎస్ తాతారావు, ఎస్ఐ రాజాన ధనుంజయ్ సిబ్బందితో సోదాలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన పిల్లి నూకరాజున్ను చేసి ఆరా తీయగా పలు దొంగతనాలకు పాల్పడినట్టు అంగీకరించాడన్నారు. అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలోని కె.కోటపాడు, అనకాపల్లి రూరల్, చోడవరం, చీడికాడ, బుచ్చయ్యపేట, వి మాడుగుల మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది ఇంటి దొంగతనాలు చేసినట్టు నూకరాజు అంగీకరించాడన్నారు నిందితుని నుంచి చోరీ సొత్తును రికవరీ చేసి, అరెస్ట్ చేశామన్నారు. నిందితున్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కె.కోటపాడు సిఐ ఎస్. తాతారావు, ఎస్ఐలు ధనుంజయ్, బి రామకృష్ణ, పిసిలు పాలవెల్లి సాయిబాబా, లీలాప్రసాద్, హోంగార్డ్ పైడుపునాయుడులను ఎస్పి మురళీకృష్ణ అభినందించి నగదు పురస్కారాలను అందజేశారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం పూర్తిగా బకాయిలు చెల్లించాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. జ్యూట్ మిల్లు మెయిన్ గేట్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో జ్యూట్ మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి మాట్లాడుతూ, కార్మికుల బకాయిలు తీర్చకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ, మార్చి 31నాటికి బకాయిలను చెల్లిస్తామని యాజమాన్యం మాట ఇచ్చి తప్పిందని విమర్శించారు. టిఎన్‌టియుసి నాయకులు ఎంవి.గురుమూర్తి మాట్లాడుతూ, యాజమాన్యం ఆస్తులు అమ్ముకుంటుందని, కార్మికుల బకాయిలు చెల్లించేందుకు మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రతినిధులు ఎం.ఆదినారాయణరెడ్డి, ఎస్.ఈశ్వరరావు, సిహెచ్.ఆదిరెడ్డి, చిట్టివలస లేబర్ యూనియన్ నాయకులు సిహెచ్ రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన భీమిలి మండలం మజ్జివలస జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ జి.శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబు ళ్లు జిఎస్‌కె.రెడ్డి, టి.వెంకటరావు, కె.చక్రవర్తి, డ్రైవర్ ఆపరేటర్లు సిహెచ్‌విఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్జీని పరిశీలిస్తున్న పిఒ సూరజ్ గనోరే

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి ఐటిడిఎ వచ్చి గిరిజనులు సమర్పించిన వ్యక్తిగత, సామాజిక సమస్యల అర్జీలను సంబంధిత శాఖాధికారులు సత్వరమే పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం రంపచోడవరం ఐటిడిఎలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా 46 దరఖాస్తులు వచ్చాయని పిఒ సూరజ్ గనోరే వెల్లడించారు.

రంపచోడవరం మండలం సిరిగిందలపాడు సీతపల్లి వాగు నుండి బోదెలకు పూడిక తీసి200 ఎకరాలకు సాగునీరు అందించాల, . 516ఇ నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని, వైఎస్ఆర్ జలసిరి ద్వారా వేసిన సాగునీటి బోర్లకు మోటార్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎంపిపి బంధం శ్రీదేవి, ఎంపిటిసి కుంజం వంశీ, బి. శేఖర్ అర్జీ సమర్పించారు. రంపచోడవరం ఐటిడిఎ ఆర్థిక సహాయంతో ఎంబిబిఎస్ పూర్తి చేసిన తనకు మెడికల్ పీజీ ఎంట్రన్స్ పరీక్ష కోసం ఆర్థికసాయం చేయాలని పెదగెడ్డ గ్రామానికి చెందిన కొండారెడ్డి తెగకు చెందిన ముర్ల తేజస్విని దరఖాస్తు సమర్పించారు. వై రామవరం మండలం ఎగువ ప్రాంతమైన బొడ్డగండి గ్రామంలో విశ్రాంతి భవనం, మంగంపాడు గ్రామంలో జిపియస్ పాఠశాల ఏర్పాటు చేయాలని సారంకోట అబ్బాయి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. వై రామవరం మండలం బచ్చులూరు గ్రామంలో డబ్బకోట కాలువపై చెక్‌డ్యామ్ మరమ్మతులు చేయాలనీ ఎంపిటిసి వెలుగురి ప్రసాద్, టీ. సన్యాసిరావు వినతిపత్రం అందించారు. వైరామవరం మండలం చవితి దిబ్బల గ్రామంలో భూసమస్య పరిష్కరించాలని పూజారి అప్పలరాజు విన్నవించారు. నిరుపేద అయిన తనకు పింఛను మంజూరు చేయాలని బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న వై రామవరం మండలం కోట గ్రామానికి చెందిన కింటుకూరి తునియారావు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఇఇలు జి.డేవిడ్‌రాజు, ఎండీ.యూసుఫ్, నాగేశ్వరరావు, డిఇఇలు సాయి సతీష్, వెంకటేశ్వరరావు, ఎఒ పి.వెంకటరమణ, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, పిఎఒ.రాంబాబు, పిహెచ్ఒ కె..చిట్టిబాబు, డాక్టర్ కల్పన, డాక్టర్ రాధిక, సిడిపిఒ సంధ్యారాణి, ఎఎంఒ సి.శ్రీహరి, ఎడిఎలు. సావిత్రి, సిహెచ్‌కెవి చౌదరి. మలేరియా శాఖ అధికారి రామకృష్ణ,. ఎస్ఒలు కబోది మార్తమ్మ, డిటి చైతన్యబాబు, గిరిజన సంక్షేమ శాఖ డిడి కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, మత్స్యశాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు,

సీలేరులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో రంజాన్ పండగ పురస్కరించుకుని స్థానిక మసీదులో అధికారులు ప్రజాప్రతినిధులకు సోమవారం సాయంత్రం స్థానిక ముస్లిములు ఇస్తారు విందు ఏర్పాటు చేశారు. ఏటా రంజాన్ పండగ సందర్భంగా సర్వ మతస్థులతోపాటు గ్రామ పెద్దలకు అధికారులకు స్థానిక మహమ్మదీయులు ఇఫ్తారు విందు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా రంజాన్ పండగ పురస్కరించుకొని ఇస్తారు విందు అనంతరం మహమ్మదీయులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మారెమ్మ పండగ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో మారెమ్మ అమ్మవారి 51వ వార్షికోత్సవ సంబరం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి గరగ అలంకరణ భక్తులు అగ్నిగుండం తొక్కుతూ ఆలయంలోకి ప్రవేశించే వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల మారెమ్మ మాలధారణ చేసిన సీలేరు పరిసర ప్రాంతాలకు చెందిన 80 మంది అగ్నిగుండం తొక్కి భక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా డొంకరాయికి చెందిన తమిళ పూజారి అమ్మవారికి పంచామత అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు భద్రత కల్పించారు.

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హౌస్ అరెస్టు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : అడ్డతీగల మండలం వేటమామిడి పంచాయతీలో స్థానిక ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్న నేపథ్యంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావును సోమవారం ఉదయమే పోలీసులు లోదొడ్డి పంచాయతీ, కేశవరంలో గృహనిర్బంధం చేశారు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన రామారావు, తాము లేవనెత్తిన సమస్యను పరిష్కరించకుండా పదేపదే తనను అరెస్ట్ చేయడం దుర్మార్గమని పోలీసులను ప్రశ్నించారు .కాగా బోయ/వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో దీన్ని వ్యతిరేకిస్తున్న గిరిజనులు, గ్రామాలకు వచ్చిన వైసిపి ఎమ్మెల్యేలు, ఇతర నేతలను దీనిపై నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మిని ప్రశ్నిస్తున్న నేపథ్యంలో సమాధానం చెప్పలేక పోలీసులను ప్రయోగించి అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలకు పాల్పడుతున్నారని కేశవరం మహిళలు మండిపడుతున్నారు. లోతా రామారావును వెంటనే విడుదల చేయకుంటే పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

రాంబాబును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

ఆదివాసీ నేతల అరెస్టులు అప్రజాస్వామికం.

రాజవొమ్మంగి: బోయ/వాల్మీకి, మెంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేర్చుతూ ప్రభుత్వ ఇటీవల తీసుకొచ్చిన జిఒ.52పై ఎందుకు ప్రశ్నించడం లేదని ఎమ్మెల్యే, ఇతర వైసిపి నేతలను నిలదీస్తున్న ఆదివాసీ నేతల అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు అప్రజాస్వామికమని ఆదివాసీ జెఎసి నేతలు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, వజ్ర అప్పారావు మండిపడ్డారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన నేపథ్యంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావును కేశవరంలో హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులు, గృహనిర్బంధాలతో ఉద్యమాలు ఆగవని, సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో మరిన్ని ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కొమ్మికలో 'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి -కొయ్యూరు : కొమ్మిక పంచాయతీ దేగలపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు ఇంటింటికీ వెళ్లిజగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో కొమ్మిక మాజీ సర్పంచు సర్ల లోవరాజు, పొడుగు శివాజి, కొమ్మిక మాజీ ఎంపిటిసి, ధోని బాబ్జి, గలీవిరి దేముడు పాల్గొన్నారు.

జెన్‌కో నూతన ప్రాజెక్టులో

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి

- ఎపి జెన్‌కో ఉద్యోగ సాధన సమితి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

సీలేరులో ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - సీలేరు: సీలేరులో నూతనంగా ఏర్పాటుచేస్తున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంలో దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు, సీలేరు తదితర ప్రాంతాల్లోని స్థానిక నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పించాలని ఎపి జెన్‌కో ఉద్యోగ సాధన కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఎపి జెన్‌కో ఉద్యోగ సాధన కమిటీ ఆధ్వర్యంలో సీలేరులో నిర్వహించే భారీ సమావేశం జయప్రదానికి సోమవారం జీకే వీధి మండలం గుమ్మరేవులు పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పొక్కమానబైలు గ్రామంలో గిరిజనులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు గొర్లె గణేశ్వరరావు మాట్లాడుతూ, సీలేరు జెన్‌కో ప్రాజెక్టులో స్థానిక గిరిజన యువతకు ఉద్యోగావకాశాల కల్పనపై మన్యవానులను చైతన్యపరుస్తున్నామన్నారు. అంతేకాక మారుమూల గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, తదితర మౌలిక వసతులను జెన్‌కో సిఎస్ఆర్ నిధులు వెచ్చించి కల్పించాలని డిమాండ్ చేశారు. ధారకొండలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టి గిరిజనులకు వైద్యసేవలు అందుబాటులో తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి జెన్కో ఉద్యోగ సాధన కమిటీ కోశాధికారి మూడు మోహన్‌బాబు, కార్యనిర్వాహక సభ్యులు మనోజ్ కుమార్ టొక్కు బాబు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గిరిజన ద్రోహులైన నేతలు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేరుస్తూ జిఒ 52 జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని గిరిజన ద్రోహులైన ప్రజాప్రతినిధులు వెంటనే తమ పదవులకు రాజీ నామా చేయాలని గిరిజన సంఘం, గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేత ఎస్.సూరిబాబు మాట్లాడుతూ, రిజర్వేషన్లలో నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నా గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనికి బాధ్యత వహిస్తూ ఎంపీ, ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు.

34 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -కొయ్యూరు : బైక్ ఆటోల్లో గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి 34కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని కొయ్యూరు సిఐ స్వామినాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని దొడ్డివరం గ్రామం సమీపంలో కొయ్యూరు పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా చింతపల్లి మార్గం నుంచి కాకరపాడు మీదుగా కత్తిపూడి హైవే వైపు ఆటో, బైక్‌పై వెళుతున్న ఐదుగురు వ్యక్తులు, పోలీసులను చూసి, వాహనాలను వెనక్కు తిప్పి పరారవుతుండగా వెంబడించి పట్టుకున్నామని తెలిపారు. ఆటో కింది భాగంలో ఉంచి తరలిస్తున్న 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆటో వచ్చిన ముగ్గురు, పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు నిందితులను స్వాధీనం చేసుకోవడంతోపాటువారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి తరలిస్తున్న నిందితులు తిరుపతికి చెందిన కావిడి వెంకటేష్, గూడెం కొత్తవీధి మండలానికి చెందిన ముర్వల గణేష్, కృష్ణబాబు, చింతపల్లి మండలానికి చెందిన కించె సన్యాసి పడాల్, పాంగి నాగేంద్రబాబులను అరెస్టు చేశామనానరు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా, సీఐ ఎ.స్వామినాయుడు ఆధ్వర్యంలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా గంగాలమ్మ పండగ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం అన్నవరంలో గంగాలమ్మ తల్లి పండగ ఆది,సోమవారాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గిరిజనులు ఏటా నిర్వహించే ఈ పండగలో పెద్ద చిన్న అనే తారతమ్యం లేకుండా భారీ సంఖ్యలో గిరిజన మహిళలు పాల్గొని వారి ఆచార సంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించారు. ఆదివారం సంత కావడంతో గుర్తేడు దారకొండ గిరిజనులు పండగలో పాల్గొని ఆటపాటలను ఆసక్తిగా తిలకించారు. దీంతో ఆ గ్రామాల ఆలయ ప్రాంగణాలు జనసంద్రంగా మారాయి. మన్యంలోని అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు సైతం గంగాలమ్మతల్లి పండగలో పాల్గొనడం విశేషం.

న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తాం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : తమ కుమారుడు బలవన్మరణానికి కారణమైన వ్యక్తులను అరెస్ట్ చేసి, తమకు న్యాయం చేయాలని సోమవారం రాజవొమ్మంగి పోలీసులను మండలంలోని అమ్మిరేకుల గ్రామానికి చెందిన ఎల్లం దేవుడితో సహా ఆ గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు వేడుకున్నారు. ఎల్లం దేవుడి కుమారుడు ఎళ్ళం వెంకటేశ్వర్లు ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో తన కొడుకు మరణానికి మండలంలోని ఒక దినపత్రిక విలేకరి వేధింపులే కారణమని ఆరోపిస్తూ రాజఒమ్మంగి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు